క్లుప్తంగా

నీళ్లు విడుదల చేయమంటే అరెస్టులా..



పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నేతలు

చొప్పదండి: పంటపొలాలకు నీళ్లు విడుదల చేయమని అడిగితే అరెస్టులు చేయడం బాధాకరమని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు లోక రాజేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కొత్త గంగారెడ్డి, బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ ఇంచార్జి బందారపు అజయ్ కుమార్ ఆదివారం విచారం వ్యక్తం చేశారు. పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారని వాపోయారు. అరెస్టయిన వారిలో కొత్తూరి మహేశ్, సింగిరెడ్డి వెంకటరమణారెడ్డి, చంటి బాబు, ఉప్పుమల్ల మధు, తదితరులున్నారు.

గంగాధర: మండలంలో మంత్రుల పర్యటన సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. వరదకాలువ, నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీరు విడుదల చేయాలని మంత్రుల కార్యక్రమంలో నిరసన వ్యక్తం చేస్తారనే సమాచారంతో పోలీసులు ఆదివారం ఉదయమే అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పోలీసుల అదుపులో భూ బాధితులు



పోలీసుల అదుపులో రైతులు

రామడుగు: రామడుగు సమీపంలో నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జితో భూములు కోల్పోతున్న రైతులను ఆదివారం ఉదయం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడంతో ఇరువైపులా భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం పరిహారం అందజేయలేదు. పలుమార్లు అధికారులను కలిసి పరిహారం ఇవ్వాలని వేడుకున్నారు. మండలంలోని షానగర్ గ్రామ పరిధిలో నిర్వహించే రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి మంత్రులు వస్తున్నారని ముందస్తుగా పోలీసులు అదుపులోకి తీసుకోవడం సరికాదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మున్నూరుకాపులు ఐక్యతచాటాలి



నాయకులను సన్మానిస్తున్న కులబాంధవులు

జమ్మికుంట: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్నూరుకాపులు ఐక్యత చాటాలని మున్నూరుకాపు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొనగంటి మల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని దుబ్బామల్లికార్జున స్వామి ఆలయంలో మున్నూరుకాపుల సమావేశం నిర్వహించారు. ఇటీవల జమ్మికుంట పట్టణ, మండల అధ్యక్షులుగా ఎన్నికైన ఏబూసి శ్రీనివాస్, తోట లక్ష్మణ్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎడ్ల రాజేందర్‌ను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, పొనగంటి సారంగం, కాసర్ల రాములు, మర్రి అవినాష్, పంతాటి రవీందర్, పొనగంటి శ్రీధర్, చంద మహేందర్, పోశయ్య, పూరెల్ల రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

చొప్పదండి: మండలంలోని చిట్యాలపల్లి గ్రామానికి చెందిన రాపెల్లి అనసూయ(65) ఆత్మహత్య చేసుకుందని పోలీసులు తెలిపారు. నాలుగేళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి గ్రామ శివారులోని వ్యవసాయబావిలో దూకింది. మృతురాలి కుమారుడు అనిల్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అట్రాసిటీ కేసు

జమ్మికుంట: కులం పేరుతో దూషించిన వ్యక్తిపై ఆదివారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రామకృష్ణ తెలిపారు. పట్టణానికి చెందిన అకినపల్లి శ్యామ్ డెకరేషన్ వర్క్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడుడు. ఈ నెల 1న పని నిమిత్తం గాంధీచౌక్ వైపు స్నేహితులతో కలిసి వెళ్తుండగా జమ్మికుంటకు చెందిన వ్యక్తి వాహనాన్ని అడ్డుగా పెట్టి కులంపేరుతో దూషిస్తూ చంపుతానని బెదిరించాడని, శ్యామ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

పుస్తక ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్: బొల్లం బాలకృష్ణ రచించిన 'పున్నమి పూత' అక్షరాల జానపదుల జీవన కలబోత పుస్తకాన్ని తెలంగాణ రచయిత వేదిక బాధ్యులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కవులు బూర్ల వెంకటేశ్వర్లు, అన్నవరం దేవేందర్, భాగ్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ మరిచారు..

- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా పల్లె ప్రకృతి వనాలు
- గ్రామాలకు దూరంగా నిర్మాణం
- ఆహ్లాదం అందని వైనం
- నిర్లక్ష్యపు నీడలో ప్రకృతివనాలు



హుజూరాబాద్ మండలంలో ఓ గ్రామానికి దూరంగా నిర్మించిన పల్లె ప్రకృతి వనం(ఫైల్)



ప్రకృతి వనంలో మందుసీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు

హుజూరాబాద్‌రూరల్: గ్రామాల ప్రజలు ఆహ్లాదకర వాతావరణానికి నోచుకోవడం లేదు. పల్లె ప్రకృతి వనాల నిర్వహణ సరిగ్గా లేక బోసిపోతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆహ్లాదం పంచే పచ్చని చెట్లతో కూడిన వనం ఏర్పాటు చేయాలని పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ స్థలాల్లో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసినా అవికాస్త జనాలకు దూరంగా ఉండటంతో ఆహ్లాదం అందకుండా పోతోంది. ఖాళీగా ఉన్న స్థలాల్లో చిట్టడవులను పెంచడం ద్వారా వాయు కాలుష్యం తగ్గి.. ప్రజలకు స్వచ్ఛ గాలి అందుతుందని భావించింది. ఇందుకోసం పల్లె ప్రగతి నిధులను ప్రత్యేకంగా వెచ్చించి ప్రకృతి వనాల్లో వేప, ఉసిరి, జామ, చింత, దానిమ్మ, టేకు, కానుగ ఇతర రకాల మొక్కలను పెంచారు. అయితే మొదట్లో వాటి నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించిన అధికారులు.. కొన్నేళ్లకు గాలికి వదిలేయడంతో అధ్వానంగా మారాయి. మొక్కలు, చెట్లు పెరగాల్సిన ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు దర్శనిమిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొన్ని ప్రకృతి వనాలు కేవలం బోర్డులు, ఫెన్సింగ్‌లకే పరిమితమయ్యాయి. పల్లె ప్రకృతి వనాలు ఊరికి దూరంగా ఉండటంతో రాత్రివేళ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. నిర్వహణను గాలికివదిలేయడంతో పిచ్చిమొక్కలు, గుబురు పొదలతో నిండుకున్నాయి. దీంతో యువకులు గంజాయి సేవిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. మరోవైపు మద్యం ప్రియులకు అడ్డాగా మారున్నాయి. సెలవు దినాల్లో మరింత రెచ్చిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం



పల్లె ప్రకృతి వనాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తాం. వన మహోత్సవంలో భాగంగా అన్ని ప్రాంతాల్లో మొక్కలు నాటించి పెంచుతున్నాం. మొక్కల సంరక్షణకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాం. పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచే స్థలాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా, పల్లె ప్రకృతి వనాల నిర్వహణకు పటిష్ట చర్యలు చేపడతాం.

– తూర్పాటి సునీత, ఎంపీడీవో, హుజూరాబాద్



హుజూరాబాద్: పట్టణంలోని మున్నూరుకాపువాడలో నివాస గృహాల మధ్య ఖాళీ స్థలాల్లోని ముళ్లపొదలు చిట్టడవిని తలపిస్తున్నాయి. డ్రైనేజీలు లేక దోమల వృద్ధి చెందడంతో రాత్రివేళ కంటి మీద కునుకులేకుండా పోతుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిచ్చిమొక్కలు, మురుగునీరు నిల్వడంతో దుర్వాసన వెలువడుతుందని, సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి

సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, సెల్ నం.8333004821

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ప్రజా సమస్యలపై పోరాడేది 'కమ్యూనిస్టులే'



మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి

జమ్మికుంట: ప్రజా సమస్యలపై పోరాటం చేసేది కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. కాంగ్రెస్ కంటే ముందు దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్‌వారితో పోరాటం చేసిన చరిత్ర కమ్యూనిస్టులేదని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, దేశం, ప్రజల కోసం అనేక త్యాగాలు చేసిందని ప్రస్తుత ప్రభుత్వాలు పారిశ్రామికవేత్తలకు మేలు చేస్తూ పేదపై భారం మోపుతుందని ఆరోపించారు. భారత రాజ్యాంగం మార్చే కుట్రతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పని చేస్తుందని, ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శీలం అశోక్, జిల్లా కమిటీ సభ్యులు కొప్పుల శంకర్, సమ్మయ్య, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం



మాట్లాడుతున్న నాయకులు

మానకొండూర్: గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని కరీంనగర్ మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. మండలంలోని గంగిపల్లి గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు కంది రాజిరెడ్డి ఆధ్వర్యంలో 'ఇంటింటికీ బీజేపీ మహా సంపర్క్ అభియాన్ నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంచుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని, జిల్లా ఉపాధ్యక్షుడు, కేంద్ర ఫిల్మ్‌బోర్డ్ సభ్యుడు రంగు భాస్కరాచారి, జిల్లా కార్యవర్గ సభ్యులు అంబటి తిరుపతి రాజు, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి బండ రాజిరెడ్డి, బూత్ అధ్యక్షులు రధారపు సాగర్, బుర్ర సంపత్, ఆకుల మధు, రావుల వెంకట రాజం, ముల్కల శ్రీనివాస్, తిక్క దేవేందర్, నాయకులు కనకం నాగయ్య, కాట మొగిలి, కాసిడి రాజు, పిట్టల అంజయ్య, మంత్రి జితేందర్, రాధారపు రాజకుమార్, ఎనగందుల సంపత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ మహాసభ



మాట్లాడుతున్న యుగేందర్

చిగురుమామిడి: కోటి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరుద్యోగులకు మొండి చెయ్యి చూపించిందని అఖిల భారత యువజన సమైక్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బామండ్లపెల్లి యుగేందర్ ఆరోపించారు. ఆదివారం చిగురుమామిడిలోని ముస్కు రాజిరెడ్డి స్మారక భవనంలో ఏఐవైఎఫ్ మండల మహాసభ నిర్వహించారు. ఏటా జాబ్ క్యాలెండర్ జాడే మరిచిపోయారని, రాజీవ్ యువవికాసం ఊసే ఎత్తడంలేదని ఆరోపించారు. మహాసభకు యువజన సమైక్య నాయకులు మండల నాయకులు చెంచల రవి, పైడిపెల్లి శివ, మహేశ్, శ్యామ్, అజయ్,హరీశ్, నవీన్, వెంకట్, కార్తీక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు ఉద్యమకారుల సమావేశం

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్‌లోని ఫిల్మ్‌భవన్‌లో సోమవారం తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఉమ్మడి కరీంనగర్ జిల్లా సర్వసభ్య సమావేశం జరుగనుంది. తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర చైర్మన్ సుల్తాన్ యాదగిరి, రాష్ట్ర వైస్ చైర్మన్ బొగె పద్మ, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు శనగరపు యువరాజు, బహుజన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కన్నం లక్ష్మణ్ పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

కోతులతో భయాందోళన



గోడపై కోతుల గుంపు

జమ్మికుంట రూరల్: మండలంలోని పాపయ్యపల్లిలో కోతులతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. కోతుల బెడద నుంచి కాపాడాలని అధికారులను కోరుతున్నారు. గ్రామ శివారులో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు డీసీఎం వ్యాన్‌లో సూమారు వెయ్యి కోతులను వదిలిపెట్టి వెళ్లిపోయారని తెలిపారు. ఇళ్లలోకి చేరి వస్తువులను చిందర వందర చేస్తున్నాయని, గుంపులుగా మీదికి ఎగబడుతున్నాయని, ఇంట్లో నుంచి బయటకు వెళ్లే పరిస్థితి లేదని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

కొత్తపల్లి: కొత్తపల్లి పట్టణంలో ఆదివారం రాజరాజేశ్వరి లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆస్పత్రి సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 276 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 46 మందికి ఆపరేషన్ అవసరం ఉన్నట్లు ఆప్తోమిస్ట్ మదర్‌ఖాన్ తెలిపారు. వీరికి ఈనెల 7న రేకుర్తి కంటి ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించనున్నట్లు రాజరాజేశ్వరి లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నరహరి లక్ష్మారెడ్డి, బండ గోపాల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు గుండేటి రామచంద్రం, మాజీ మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, మాజీ ఎంపీపీ వాసాల రమేశ్, కాంగ్రెస్ నాయకులు ఖాజాఖాన్, గున్నాల రమేశ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం

చొప్పదండి: పట్టణంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు నిర్వహించారు. సంఘం మండల అధ్యక్షుడిగా తొడుపునూరి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడిగా బోనగిరి చంద్రశేఖర్, యువజన అధ్యక్షుడిగా కటకం సాయిరాం ఎన్నికయ్యారు. మండల కార్యదర్శిగా పెద్ది గోపికృష్ణ, కోశాధికారిగా తాటిపెల్లి శ్రీనివాస్, పట్టణ కార్యదర్శిగా తొడుపునూరి సందీప్, కోశాధికారిగా సముద్రాల రాజు, యువజన కార్యదర్శిగా తాటిపెల్లి మణిసాయి, కోశాధికారిగా సిరిపురం సాయి విక్రాంత్ నియామకమయ్యారు. ఎన్నికల అధికారిగా కటుకం భూమయ్య వ్యవహరించగా, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు కన్న క్రిష్ణ, పడకంటి శ్రీనివాస్, శివనాథుని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గ్రేన్ మార్కెట్ మర్చంట్ అసోసియేషన్..

చొప్పదండి గ్రేన్ మార్కెట్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొల్లూరి ఆనందం, ఉపాధ్యక్షులుగా యాంసాని సాంబమూర్తి, మాడూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కటకం మల్లికార్జున్, కోశాధికారిగా నలుమాచు విజయ్ కుమార్, సహాయ కార్యదర్శిగా సూర రమేశ్ ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారుడిగా మాజీ అధ్యక్షులను నియమించారు.


వనభోజన మహోత్సవం



వనభోజన మహోత్సవంలో ఆర్యవైశ్యులు

హుజూరాబాద్: పట్టణ శివారు కేసీ క్యాంపులోని వైశ్య సదన్ ప్రాంగణంలో ఆర్యవైశ్య వనభోజన మహోత్సవం అట్టహాసంగా జరిగింది. వందలాది మంది సంఘం సభ్యులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సన్మానాలు, సామాజిక చైతన్య కార్యక్రమాలు వినోదాత్మకంగా సాగాయి. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతులు, మొక్కలు పంపిణీ చేశారు. లక్కీ డిప్ విజేతలకు మూడు బహుమతులు ప్రదానం చేశారు. వనభోజన కార్యక్రమానికి మున్సిపల్ మాజీ చైర్మన్ గందె రాధిక శ్రీనివాస్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు హరిశంకర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ సంఘం



ఆమోస్‌ను అభినందిస్తున్న సంఘం సభ్యులు

రామడుగు: మండలంలోని తిర్మలాపూర్ గ్రామ అంబేడ్కర్ సంఘం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా తడగొండ ఆమోస్ గెలుపొందారు. అనంతరం సంఘం సభ్యులు ఆమోస్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ఘనంగా ఫ్రెండ్‌షిప్ డే



ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లతో దివ్యాంగులు



ఇల్లందకుంట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ 2002–03 పదో తరగతి విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. చిన్నకోమటిపల్లి స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పూజలు చేశారు. అన్ని బంధాల కంటే స్నేహబంధం ఎంతో విలువైనదని, మంచి స్నేహితుడు ఒక్కరు ఉన్నా ఎంతో భరోసాగా ఉంటుందన్నారు. కష్టసుఖాలను పంచుకునే స్నేహితుడు ఉన్నప్పుడు ఆత్మస్థైర్యం పెరుగుతుందని, వారు ఇచ్చే ధైర్యంతో ఉన్నత శిఖరాలకు ఎదిగిన వారు ఎందరో ఉన్నారని, స్నేహంలో చిన్నచిన్న మనస్పర్థలు వచ్చినా సర్దుకుపోవాలన్నారు. అందరం ఒకచోట కలిసి స్నేహితుల దినోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు లకిడే అనిల్, కందాల సురేశ్, దేవ ప్రకాష్, అప్పల పున్నం చందర్, కందాల వేణు, రావుల రాజు, వెంగల లక్ష్మణ్, పైడిమల్ల రాజేందర్, పూరెళ్ల చంద్రమౌళి, మేకల నరేశ్, సానవేన శ్రీనివాస్, మాదాసు సురేశ్, గణేశ్, పైడిపల్లి రాజేందర్, రవీందర్, రావుల కుమార్, చింతల ఐలయ్య, రావుల కనకరాజు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని సాయి మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో ఫ్రెండ్‌షిప్ డే ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపక ,పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు సుత్రపు బచ్చిరాములు, టీచర్లు, ఆయాలు, అటెండర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగదే కావాలట..

- యూపీఐ చెల్లింపులకు వ్యాపారుల తిరస్కారం
- జిల్లాలోని ఎరువుల దుకాణాల్లో ఇదో రకం దందా



'నగరంలోని గాంధీరోడ్డులో ఉన్న ఓ ఎరువుల వ్యాపారి వద్దకు ఎరువులతోపాటు, మందులు కొనుగోలు చేసేందుకు కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, తిమ్మాపూర్ మండలాలకు చెందిన రైతులు వస్తుంటారు. సదరు వ్యాపారి ఒక్కో ఎరువుల బస్తాపై రూ.80 నుంచి 100 వరకు అధికంగా వసూలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఈ వ్యవహారం బయటపడుతుందని, యూపీఐ విధానంలో చెల్లింపులకు ఒప్పుకోకుండా కేవలం నగదు మాత్రమే తీసుకుంటున్నాడు'.

కరీంనగర్ అర్బన్: యూరియా కొరత వ్యాపారులకు వరంగా మారుతోంది. జిల్లాలో కురుస్తున్న వర్షాలకు వరి, పత్తి పంటలకు ఎరువులు అవసరం కావడంతో అన్నదాతలు యూరియా కోసం బారులు తీరుతున్నారు. ఒక బస్తా కావాలంటే నానో యూరియాతో పాటు డీఏపీలను తీసుకోవాల్సిందేనని తెగేసి చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. జిల్లాలో దాదాపు 55వేల ఎకరాల్లో పత్తి, 1.50లక్షల ఎకరాలకు పైగా వరి సాగు చేశారు. మొదటి దశలో ఎకరానికి బస్తా యూరియా చొప్పున 2.05లక్షల యూరియా బస్తాలు అవసరం. ఇదే వ్యాపారులకు అవకాశంగా మారుతోంది. చాలామంది అధిక ధరలు అమ్మే విషయం బయటపడకుండా యూపీఐ చెల్లింపులు వద్దంటూ నగదు మాత్రమే తీసుకుంటూ జాగ్రత్త పడుతున్నారు.

బస్తాకు అదనంగా రూ.100 వసూలు

బస్తాకు యూరియాకు రూ.266 ధర నిర్ణయించగా వ్యాపారులు రూ.350 నుంచి 400 వరకు తీసుకుంటున్నారు. ఎరువులు తీసుకుంటేనే తర్వాత అప్పు కింద పిచికారీ మందులను ఇస్తున్నారు. వ్యాపారులను కాదని సహకార సంఘం, ఇతరుల వద్ద ఎరువులు కొనుగోలు చేస్తే మిగతా మందులు ఇవ్వడం లేదని, చేతిలో నగదు లేక వారి వద్దనే అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. యూరియాతోపాటు, ఇతర ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తుండగా వ్యవసాయశాఖ చోద్యం చూస్తోందని వాపోతున్నారు. ప్యాక్స్, డీసీఎంఎస్‌ల్లోనూ అధికంగా వసూలు చేస్తున్నారని అన్నదాతలు వివరించారు. ఉన్నతాధికారులు దృష్టిసారించాలని వేడుకుంటున్నారు. కాగా యూరియా బస్తా కావాలంటే డీఏపీ, ఇతర ఎరువులు కొనాలని మెలిక పెడితే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. అధిక ధరలకు విక్రయిస్తే ఫిర్యాదు చేయాలని చెబుతున్నారు.

ఫిర్యాదు నంబర్లేవీ.. అవగాహనేదీ

వ్యాపారులు యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తూ రైతులను పిండేస్తుండగా అవగాహన కల్పించాల్సిన వ్యవసాయ శాఖ నామమాత్రంగా మిగిలిపోయింది. రాష్ట్రస్థాయిలో టోల్ ఫ్రీ ఫిర్యాదు నంబర్ 8977741771 ఉండగా దానిపై రైతులకు అవగాహన కల్పించాల్సి ఉండగా ఆ దిశగా చర్యల్లేకపోవడం విడ్డూరం. వ్యాపారులు కేవలం రాష్ట్రస్థాయి నంబర్‌ను మాత్రమే ప్రదర్శిస్తుండగా పలు దుకాణాలు నిబంధనలను విస్మరిస్తున్నాయి. జిల్లాస్థాయిలో ఫిర్యాదు నంబర్ ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటికీ ఆ ఊసే లేదని తెలుస్తోంది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పదో తరగతి విద్యార్థులు



ఇంటర్ విద్యార్థులు

మానకొండూర్: మండల కేంద్రంలోని ఓప్రైవేటు పాఠశాల 1999 -2000 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒక చోట చేరి చదువుకున్న రోజుల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్, ఆడెపు రవీందర్, రమేశ్, శకుంతల పాల్గొన్నారు.

జమ్మికుంటలో...

జమ్మికుంట: పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ప్రైవేటు జూనియర్ కళాశాల 2007–09 విద్యా సంవత్సరం విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న రోజులనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దబ్బెట రవీందర్, ప్రిన్సిపల్ విజేందర్‌రెడ్డి, డైరెక్టర్లు బండి ప్రభాకర్, మల్లారెడ్డి ఈత మల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు ఉషశ్రీ, అనిల్, వేణు, సాయి, కృష్ణ, వెంకటేష్, రాజిరెడ్డి, శ్రీనివాస్, రాము విద్యార్థులు పాల్గొన్నారు.